జీవితం పరిమితమైనది కాదు, ఒక దగ్గరే ఆగిపోవడానికి.
వేసవిలో ఎండి బలహీనమైపోయిన నదులు, వానల్లో గలగలా ప్రవహిస్తాయి.
అది ప్రకృతి ధర్మం. ఋతువులు మారినట్లే మనిషి కూడా మారుతూ ఉన్నాడు.
నిత్యచలనశీలత ఉంటేనే మనుగడ. మనం అనుకునేవాళ్లు దొరక్కపోతేనో,
దూరమైతేనో అక్కడే ఆగిపోయి, సుఖంగా ఉండలేక, చుట్టూ ఉన్నవాళ్లని
సుఖంగా ఉంచలేక జీవితమంతా బాధతో గడిపేయడం అవసరమా?
అలాంటి జీవితాల్ని దగ్గర నుంచి చూశాను. అందుకే ఈ కథ.

షాజహానా

# 2 ఊపిరి





అతను నన్నలా వదిలేసి వెళ్లిపోయాక మొదటిసారి నాకు శ్వాస పీల్చడం చాలా కష్టమైంది. అలా చాలాసార్లు అనిపించింది. హెల్త్ ప్రాబ్లెమా అంటే అలాంటిదేదీ లేదు.

కానీ అతను నన్నిలా ఈ భూగోళం మీద ఒంటరిని చేసి వెళ్లి పోయాక... ఎందుకు ఊపిరి కూడా అందలేదు... భళ్లుమని దుఃఖం తన్నుకు రాలేదు... శరీరం మొత్తం ఫ్రీజ్ అయినట్లు... గాలి ఆడనట్లు... ఏదో సఫకేషన్... చాలారోజులు... తిన్న అన్నం వాంతయిపోయింది... కానీ మనసు కళ్లు వమించలేకపోయాయి.

సంవత్సరాలు అనుభవించిన జీవితం తరువాత నేను నమ్మిన వ్యక్తి. కానీ అతనూ విశ్వాసఘాతం చేసి వెళ్లిపోయాడు... నా నమ్మకానికి శరాఘాతం చేసి వెళ్లిపోయాడు.

అప్పటిదాకా అతని చేయి నా తలమీద ఉండేది... ఇప్పుడు చూస్తే ఏ ఆచ్ఛాదనా లేదు.

ఖాళీగా ఉంది బ్రతుకు.

* * *

ఆమె వచ్చింది...

వస్తూ వస్తూ కొన్ని కనకాంబరాలని... మల్లెల్ని మరువాన్ని మాలకట్టి నాకోసం తీసుకువచ్చింది.

నాకు నవ్వొచ్చింది...

ఎన్నాళ్లయింది నేను పూలను చూసి. వాసన పీల్చి...

అతను ఎంతిష్టంగా నాకు పూమాలలు పంపించేవాడు... అలా పంపలేని సమయాల్లో అంతే ఇష్టంగా అక్షరాల మాలల్ని వాట్సప్‌లో పంపేవాడు. నాకు వాడిపోయే పూమాలలకన్నా అవే ఇష్టం.

బేసిగ్గా హృదయమున్న మనిషి. కవి, రచయితా...? ఏమో కావొచ్చేమో...? కానీ మనిషయిం తరువాతేగా కవి అవుతాడు...

అయినా అతని కవిత్వంలో తేలియాడే కదా... జీవితానందాన్ని ఫలింపజేసుకున్నది.

* * *

ఆమె వస్తే చాలు...

ఎందుకో ఎక్కడో కోల్పోయిన ఎదబంధాన్ని మళ్లీ కలుసుకున్నంత ఆనందంగా అనిపిస్తుంది.

ఆమె గురించి నాకేమీ తెలియదు నిజానికి. నిన్న వాచ్‌మేన్ వైఫ్‌ని అడిగితే చెప్పింది, ఆమె గురించి. ఆమెను కాదని కొడుకు వెళ్లిపోయాడు ఈ ప్రపంచం నుంచి... అతనే ప్రపంచమనుకున్న కొడుకు! ప్చ్...

ఎక్కడైనా మాట వింటారు కానీ ఈ విషయంలో ఎవరూ ఎవరి మాట వినరు కదా!

నాకు చాలా ఆశ్చర్యం వేసింది. ఆమె ఎలా అలా ఉంటుంది?

ఎలా బ్రతుకుతుంది?

ఆమె వస్తూ వస్తూ చక్కెరకేళీలు  తీసుకొస్తుంది. ఆమె మాటల్లాగే ఎంత మధురం. ఆమె తెచ్చే పూలకు పరిమళమున్నట్లు! ఆమె మాట వెనుక ఏమైనా లోతైన అర్థాలున్నాయా అని ఆలోచిస్తుంటాను. కానీ ప్రత్యేకంగా నా గురించి ఏమీ మాట్లాడినట్లు అనిపించదు...

ఈ ఫ్లాట్‌లో నేను ఒక్కదాన్నే  ఉంటానని జాలితో కాబోలు ఆమె అప్పుడప్పుడూ పలకరిస్తుంటుంది. అలా అని పనిగట్టుకుని నా కాలాన్ని పాడుచేయడానికి వస్తున్నట్లు అనిపించదు.

ఆమె వస్తే మంచి కాఫీ చేస్తాను, తాగుతుందేమో అడిగి. ఒకోసారి తాగదు. అందుకే అడగడం.

ఆమె గురించి నాకేమీ తెలీదన్న విషయం ఆనందం కలిగిస్తుందేమో... నేను అలాగే ఉంటాను, ఏమీ తెలీనట్లు. ఆమె చెప్పిందల్లా వింటాను కొత్తగా... ఆశ్చర్యంగా ముఖం పెట్టి.

ఒకసారి చెప్పింది... తన గురించి తెలిసిన ఎవరి దగ్గరికీ తను వెళ్లదట. మళ్లీ గాయం రేగుతుందట. కొన్ని మర్చిపోవాలట. లేకపోతే మనుషులు కొలాప్స్ అయిపోతారట. కాబట్టి మనిషి మనస్సును ఇతర విషయాలవైపు మరల్చుకోవాలని  చెప్తుందావిడ. ఎంత లోతు గాయం అయ్యుంటుంది?

ఎన్నాళ్లయింది? అడుగుదామనుకుంటాను....

కానీ మళ్లీ తన గురించి నాకు తెలుసనుకుంటుందని అడగలేదు.

ఒకసారి ఆమె ఎండురొయ్య కూర చేసిందట. తీసుకొచ్చింది. ఆమె ముందే స్పూన్‌తో తిని చెప్పాను... చాలా బావుందండీ అని. ఆమె చాలా సంతోషపడింది. మా బాబు అడిగి మరీ చేయించుకునేవాడు... అంది ఎక్సైటెడ్‌గా.

నేను ఏమైనా చెపుతుందేమోనని ఎదురుచూశాను. ఏం చెప్పలేదు. అవీ ఇవీ మాట్లాడి వెళ్లిపోయింది.

*  *  *

మసక చీకటి.

మిద్దె మీదకెళ్లి కూర్చున్నా...

సగం చందమామ కనిపిస్తున్నాడు. మురికిగా వెన్నెల నా మనసులాగే...

ఎలా శుభ్రం చేయడం.

ఒకసారి ఏదో కాన్ఫరెన్స్‌కి ఢిల్లీ వెళ్లివస్తున్నా. ట్రైన్‌లో పై బెర్త్. మాటలు మొదలు ఫోన్‌లో. తెల్లారొస్తుంది... ఆగనేలేదు సంభాషణ. అలా సాగుతూనే ఉంది.

తన బ్యాలెన్స్ అయిపోయింది...

నా బ్యాలెన్స్ అయిపోయింది. తను వెళ్లి వేయిస్తానన్నాడు. ఎంత చెప్పినా వినలేదు. బహుశా అప్పుడు నాలుగున్నర అయింటుంది. అప్పుడు దుకాణం ఓనర్‌ను లేపి వేయించాడు. అతని దగ్గర ఏభై అయిదు రూపాయలదే ఉందంట, అదే రీచార్జ్ చేయించాడు.

ఎందుకంత రిస్క్ అంటే ఒక్కదానివే వస్తున్నావ్ ఏదైనా అవసరమొస్తే ఎలా అన్నాడు.

నాకు బాగా గుర్తు, చిన్నపిల్లకి చెప్పినట్లు చెప్పాడు జాగ్రత్తలు.

తెల్లారి అతనికి రీచార్జ్ డబ్బు ఎలా ఇవ్వాలా అని అడిగితే నవ్వేశాడు... అవి కూడా ఇవ్వాలా అని.

కానీ ఇవ్వకపోతే నాకు నిద్రపట్టదు కదా...!

ఒక కొరియర్ ఆఫీస్‌కు వెళ్లి ఇలా నేను ఒక 55 రూపాయలు పంపించాలి...? చేరతాయా అని అడిగాను.

అతను నవ్వాడు. డబ్బు పంపకూడదండీ అన్నాడు. కాస్త బతిమిలాడాక... కానీ నాది గ్యారెంటీ కాదు అందకపోతే అని ఒప్పుకున్నాడు.

కానీ ఛేంజ్ లేక అరవై రూపాయలు పంపాను.

అందాయని చెప్పాడు.

ఇక అప్పటి నుంచి మిగతా ఐదు రూపాయల గురించి ఎంత సతాయించింది తను? రోజూ మెసేజ్ పెట్టేది. నా ఐదు రూపాయలు నాకిమ్మని. దాంతో రెండు ఎగ్స్ వస్తాయని, ఎనిమిది కొత్తిమీర కట్టలొస్తాయని, ఇంకా ఏవేవో రాసేదాన్ని. ఆ ఐదు రూపాయలు తనకెంత విలువైనవో వివరించేదాన్ని.

తల పట్టుకునేవాడు...! శరీరంనిండా తూట్లుపడ్డ బొమ్మని పంపేవాడు...! నవ్వే బొమ్మని పెట్టేది తను.

ఒకరోజు చూసేసరికి వాకిట్లో రకరకాల పళ్లున్న ప్యాక్. నువ్వే కదా అంటే, ఏం చేయమంటావు నీ ఐదు రూపాయలకు వడ్డీ కూడా కట్టి పంపాను... ఎంజాయ్ అన్నాడు.

ఎన్ని రాత్రులు మాటల్లో కరిగిపోయాయి? తను ఉండే ఫ్లాట్ చివర ఒక హోటల్ ఉండేది. అక్కడికి వచ్చి వచ్చేదా లోపలికి అనడిగేవాడు. తనకసలే కంగా రెక్కువ. వద్దు వద్దు... రావొద్దని చెప్పేది. అలిగేవాడు. ఖాలీ హాత్ భేజ్ రహీ హై జాలిమ్! అనేవాడు. నువ్వో పంటలు పండించే గోదావరివే కాదు సుడిగుండాలున్న ప్రవాహానివి అనేవాడు... గోదావరి తీరంలో పెరిగాడు కదా. మాట్లాడితే నీటిచెమ్మ స్పర్శ. అలలు అలలుగా నవ్వేవాడు.

అసలెంత బాగుండేది అతని కంఠస్వరం. ఆ కంఠం వినడానికే పదిసార్లు ఫోన్ చేసి విసిగించేది. ఏదో గంభీరజీర తనను నిలువెల్లా ముంచేసేది. తన ఫోన్‌లో రికార్డ్ చేసింది కూడా.

అతని అక్షరాల్లో ఎంతగా మునిగిపోయేది? మనసును తట్టిలేపే అతని శైలి అంటే ఎంతిష్టం తనకు.

తనకో పేరు పెట్టాడు. ఏం పేరంటే చెప్పడు. షెహజాది అంటాడు... ఎవరికి షెహజాది? దేనికి షెహజాది?

దుఃఖానికా?

* * *

ఆమె వచ్చింది.

కింద ఎవరో గాజులు అమ్ముతుంటే కొని నాకు తీసుకువచ్చింది.

నేను నా చేతుల వైపు చూసుకున్నాను. ఎప్పుడూ గాజులేసుకున్న జ్ఞాపకం లేదు. అతనెప్పుడో ఒకసారి కోరితే గాజులేసుకుని చీర కట్టుకుంది. చాలా హ్యాపీగా ఫీలయ్యాడు.

మళ్లీ ఆమె గాజులు తెచ్చి నా చేతులను ప్రశ్నార్థకాలని చేసింది.

నేను వేసుకోనని చెప్పలేదు. టేబుల్‌పై పెట్టి కూర్చుంది ఆమె.

నువ్వు తలకాయ మాంసం తింటావామ్మా అడిగింది ఆమె. తల ఊపాను. ఇవాళ అంకుల్ తినాలనుంది తీసుకొస్తానని చెప్పారు. రాగి సంగటిలోకి బావుంటుంది. నువ్వేం వండుకోకు తెస్తాను అంటూ వెళ్లిపోయింది.

* * *

ఏం తిన్నావ్ అడిగాడతను మెసేజ్‌లో.

తను ఏంటో దేనికి చెందినవాడో తెలీదు తనకు. తెలుసుకునే అవసరం కూడా రాలేదు.

బీఫ్ అని సమాధానం చెప్పింది తను.

చాలాసేపటి వరకు ఆన్సర్ రాలేదు. అప్పుడు సందేహం కలిగింది.

మీరు బ్రాహ్మలా? అని అడిగింది.

అతను నవ్వుతూ...

ప్రపంచంలో పక్కమనిషి ఏం తింటే నేనది తింటా... మా అమ్మది ఒక కులం మా నాన్నది ఒక కులం... ఏ కులమని చెప్పను? అన్ని కులాలు నావే... ఏది నా కులం కాదు...? అన్నాడు.

అతని గొంతు దూకే జలపాతంలా ఉంటుంది. ఎంతసేపటికి వదలబుద్ధ వ్వదు. అతన్నెప్పుడూ దగ్గరనుంచి చూడనేలేదు తను. ఒకసారి మాత్రం షేక్‌హ్యాండ్ ఇవ్వాలనుకుంది. ధైర్యం సరిపోలేదు. కానీ అతనికోసం మనసులో ఆకాశాల్ని పరచి ఉంచింది.

అతనేదో కంపెనీకి సీఈఓ. అయితేనేం తనతో మాట్లాడినప్పుడు చిన్నపిల్లాడిలా మాట్లాడేస్తాడు, ఏ దాపరికాల్లేకుండా. వాళ్ల అమ్మ చివరి రోజుల్లో ఎంత ఒంటరిగా క్యాన్సర్‌తో పోరాడుతూ పోయారో కుమిలిపోతాడు చెప్తూ. అప్పుడు తనకేం తోచదు ఎలా ఓదార్చాలో. ఏవేవో మాట్లాడేసేది. వాళ్ల అమ్మ అనుభవించిన ఒంటరితనాన్ని అతను జీవితాంతం మోశాడు... బహుశా తను పరిచయమయేంతవరకూ.

అతను నన్నడిగేవాడు, నీకు లక్ష్యాలు అంటూ ఏవీ లేవా? అని.

నాకు చెప్పాలనుండేది. కానీ సిగ్గేసేది. ఎందుకంటే తనకు అంత స్తోమత లేదని తెలుసు. అదే చెప్పేది తను.

నేనున్నాను కదా అనేవాడు.

ఒకసారి బలవంతం చేస్తే చెప్పింది.

ఒక అనాధాశ్రమం పెట్టాలనుందని.

బావుంది అలానే ప్లాన్ చేద్దాం అని భరోసా ఇచ్చేవాడు.

తనకు పిల్లల్లేరు... తనకు ఏజూస్పెర్మియా. అది కూడా చెప్పాడు.

మనం ఒక పాపను పెంచుకుందాం అనేవాడు.

నేను నవ్వేదాన్ని.

లేదు నాకు స్వంతంగా ఒక పాప కావాలి అనేదాన్ని. ఎవర్ని తీసుకున్నా వాళ్ల తలిదండ్రులుంటారు కదా... చివరికి తెలిస్తే వెళ్లిపోతారు అనేదాన్ని భయంగా.

నా భయం చూసి నవ్వేవాడు.

ఈ ప్రపంచంలో ఏదీ స్వంతం కాదు.

వేదాంతం చెప్పేవాడు. ఖలీల్ జిబ్రాన్‌ని వినిపించేవాడు. నువ్వు కూడా నా ప్రొడక్ట్‌వే అనేవాడు... నా రచనలను అంతగా చదువుతావు కదా... మరి? అనేవాడు.

మన భావాలు ఉంటే చాలు మన రక్తం ఉండాల్సిన పనిలేదు అనేవాడు. అసలు భావాలు మనవే ఉండాల్సిన పని కూడా లేదు.

స్వతంత్ర భావాలుండాలి అనేవాడు.

* * *

ఆమె వచ్చింది.

నువ్వెప్పుడూ ఏదో పోగొట్టుకున్నదానిలా ఉంటావెందుకమ్మాయ్? అంటూ బాల్కనీలోని కుండీలను చూసింది.

ఇదో ఈ తమలపాకు మొక్క ఆకులు కొన్ని పాడయిపోయాయి కదా... కత్తిరించెయ్, ఎందుకంటే అవి మిగతా ఆకులను పాడుచేస్తాయ్... లేకపోతే తీగ ఆరోగ్యంగా పెరగదు... చీడపట్టి చనిపోయిన వాటిని తీసేస్తేనే మిగిలినవి బావుంటాయ్. లేదంటే మొక్కని మార్చెయ్... చెప్తూనే ఉంది ఆమె.

ఆమె మొక్క గురించి చెప్పిందా నా జీవితం గురించి చెప్పిందా?

కన్ఫ్యూజ్ అయ్యాను.

* * *

ఈ ప్రపంచంలోని కదలికల్ని పట్టించుకోవడం మానేసి...

నాలో కదలిక లేకుండా చేసుకున్నాను కదా! ఇది కరెక్ట్ కాదని నా కొలీగ్ ఒకామె ఒక ప్రముఖ సైకియాట్రిస్ట్ అడ్రెస్ ఇచ్చింది.

ఆ డాక్టర్ మందులిచ్చాడు. గాయం లోతైనది అని చెప్పాడు.

మందులు వాడుతున్నకొద్దీ నేను నిద్రలోకి జారిపోయేదాన్ని... ఎంతగా అంటే తినడానికి తప్ప దేనికి మేలుకునేదాన్ని కాదు.

ఇతనికి అంతా తెలుసు నా గురించి.

అతని పరిచయం గురించి. కలల్లోనే మా ఇద్దరి కరిగిపోయిన రాత్రుల గురించి. మా వ్యక్తావ్యక్త ప్రేమ గురించి. మా ఇద్దరి కామన్ ఫ్రెండ్ ఇతను. ముఖ్యంగా నా ఒంటరి జీవితం మొత్తం పూసగుచ్చినట్లు ఇతనికి మొదటినుంచీ తెలుసు.

అతని రచనలను ఇద్దరం చదివి డిస్కస్ చేసేవాళ్లం. చాలా సాయంత్రాలు అతని మీదుగా జరిగిపోయేవి మా మధ్య.

వస్తూ వస్తూ కివీస్  తెచ్చేవాడు. అవి కూడా ఇతని మాదిరే మౌనంగా రకరకాల భావాలను అందించేవి.

ఇతను రాసిన చిన్న చిన్న కవితలు తీసుకొచ్చేవాడు.

ఇతను షార్ట్‌ఫిల్మ్‌లు తీస్తాడు. అతను రాసిన కథలను చాలా చర్చించాం ఫిల్మ్‌గా రూపొందించడానికి.

అతనెళ్లిపోయాక చాలా రోజులు ఇతను కూడా దూరందూరంగా ఉన్నాడు. దుఃఖం ఓదారుస్తుందనుకున్నాడేమో.

తరువాత నెమ్మదిగా రావడం మొదలయ్యింది.

నాకేం ప్రత్యేకంగా అనిపించలేదు. అసలు నేను తనను గమనించలేదు... ఇతనికి కూడా చలనం ఉంటుందని.

ఏవో కొత్త పుస్తకాలు తీసుకువచ్చేవాడు. నాకు దేనిమీదా మనసయ్యేది కాదు. వాట్సప్ వాడమని చెప్పేవాడు. ప్రపంచంలో వచ్చిన కొత్త సినిమాలను, క్లాసిక్స్‌ను పట్టుకొచ్చేవాడు.

ఏదో ఒక ప్రపంచాన్ని ప్యాక్ చేసి నాకోసం తెచ్చేవాడు. నేను ఈ ప్రపంచంలో ఉండేదాన్ని కాదు.

ఇతడిని పట్టించుకునేదాన్ని కాదు. వాటివేపు కన్నెత్తి చూసేదాన్ని కాదు.

పాడయిన కుండీలను ఒక క్రమంలో సర్దేవాడు... నేను చూస్తూ ఉండేదాన్ని ట్రాన్స్‌లో.

కొన్ని రోజులకు ఆ టాబ్లెట్స్ మానేయమని సలహా ఇచ్చాడు. అయితే ఒక్కసారిగా మానొద్దని చెప్పి అలా వాడించాడు.

కొన్ని నెలల తర్వాత కొంత మెలకువ వచ్చింది జీవితానికి.

అపుడే ఆమె పరిచయమయ్యింది.

కింది ఫ్లాట్‌లో ఉంటున్నారు వాళ్లు.

ఒక కూతురు ఒక కొడుకు భర్తా ఆమె. అయితే కొడుకు యాక్సిడెంట్‌లో పోయాడు. ఆ దుఃఖాన్ని దిగమింగడానికి వాళ్ల సొంతిల్లు  వదులుకొని ఈ ప్రాంతంలో అద్దెకు దిగారు.

ఇవన్నీ వాచ్‌మెన్ భార్య చెప్పింది.

* * *

'ఒక తల్లి' చదువుతున్నాను, మళ్లీ.

చిన్నప్పుడెపుడో చదివాను.

ఆమె వచ్చింది.

నాకెందుకో పుస్తకంలోంచి తల్లి లేచొచ్చిందా అనిపించింది.

కానీ ఈమె వాస్తవాన్నించి దూరంగా వెళ్లాలనుకుంటుంది. లేదా వాస్తవంతో సహా వర్తమానంతో పాటు ప్రయాణించాలనుకుంటుంది. దానికి అడ్డుగా ఉన్న అందరికీ అన్నింటికీ దూరం అవుతోంది.

కానీ ఆమెకు తెలీని విషయమేమంటే నేను తనలాంటి దాన్నేనని, ఒక చెట్టంత కొడుకులాంటి ప్రియుణ్ణి పోగొట్టుకుని ఉన్నానని. సమాధిలోంచి ఇప్పుడిప్పుడే లేస్తున్నానని. ఆమెకు తెలిసే ఆస్కారం లేదు ఎప్పటికీ. కాబట్టి నాతో హాయిగా ఉండగలుగుతోంది. ఇక్కడ నా దగ్గర గాయం కదలదు.

కానీ నాకు ఆమె బాధని కూడా భరించాల్సి వస్తుంది.

* * *

ఇతను నన్ను మునుపటిలా చూడాలని కంకణం కట్టుకున్నట్టు కనిపిస్తూనే ఉంది.

నవ్వితే బావుంటానని అతను చాలాసార్లు నాతో అని ఉన్నాడు. అదే పాఠం ఇతను మళ్లీ అప్పజెప్తున్నాడు. జీవితం అంటే రిపిటేషనా? ఇతనెందుకు నా మీద శ్రద్ధ చూపిస్తున్నాడు? నా అలవాట్లు, నా అభిరుచులు... అన్నీ బీరుపోకుండా ఫాలో అవుతాడు... వాటినే నా చుట్టూ ఉంచడానికి ప్రయత్నిస్తాడు. నాకు ఇష్టమైన రంగులు వెదజల్లుతున్నాడు, అద్దుతున్నాడు జీవితానికి.

ఇతనెవరు? అతనికి నకలా? జిరాక్సా...? భ్రమా...?

మా ఇద్దరి కామన్ ఫ్రెండ్ ఇతను. అంతవరకే కదా ఇతని పాత్ర. మరి అన్ని కంచెలు దాటేస్తున్నాడెందుకు? ఇంత జరిగినా నేనింకా కొన్ని అవయవాలతో మిగిలి నందుకా? నా మనసు మిగిలిందా? దాన్ని తవ్వి తీస్తున్నాడా? ఇతనికొచ్చే లాభమేంటి?

ఒకటా రెండా వేల ప్రశ్నలతో ఇప్పుడు నిద్ర దూరం అవుతోంది.

ఇంకో వారంలో తను పెట్టిన లాంగ్ లీవ్ అయిపోతుంది. ఆఫీస్‌కెళ్లాలి. బండి నడపలేదు. బస్సుల్లో వెళ్లలేదు... ఎలా?

ఇతను ముందే చెప్పేశాడు కార్లో డ్రాప్ చేస్తానని. కానీ తను ఎవరికీ భారం కాకూడదు కదా! ఎలా వెళ్లడం?

అసలు తను ఇతనికి లీనియన్స్ ఇస్తుందా? ఇతను లేకపోతే తనలో కనీసం ఈ మార్పు కూడా వచ్చి ఉండేది కాదుకదా!

అలాంటి స్నేహాన్ని పోగొట్టుకోవడం కరెక్టా...?

* * *

ఆఫీసుకెళ్లే రోజు...

తను రెడీ అయి కూర్చుంది. కానీ మనసొప్పడం లేదు... ఏం చేయాలో!

తను కాల్ చేస్తే ఇతనొచ్చేస్తాడు... సందిగ్ధంలో మనసు నలుగుతూ...

ఇంతలో ఆమె వచ్చింది... సంతోషంతో...

చేతిలో కృష్ణా స్వీట్ ప్యాకెట్. విప్పి తనకు తినిపించింది. పట్టలేని ఆనందంతో ఉంది ఆమె. మా అమ్మాయికి అమ్మాయి పుట్టిందమ్మా... మా ఇంట్లోకి కొత్త వసంతం వచ్చేసిందమ్మా... ఆమె ఆనందంతో ఏమేమో చెప్పేస్తోంది... నోరంతా తీయగా...

ఎందుకో ఆమె చెప్పిన మాటలు  గుర్తొచ్చాయి... 'నలిగిపోయిన చీడ పట్టిన ఆకుల్ని తీసెయ్యాలమ్మా.. అప్పుడే మిగిలిన తీగ ఆరోగ్యంగా ఉంటుంది...'

నేను అప్రయత్నంగా ఇతని నంబర్‌కు కాల్ చేయడానికి సెల్ బయటకు తీశాను.

నాకెందుకో చాలారోజుల తర్వాత మొదటిసారి ఫ్రీ బ్రీతింగ్ ఫీలింగ్ కలిగింది.

*తెలుగు వెలుగు మాసపత్రిక*
*మార్చి 2019*

✻



14 జూన్ 1974న ఖమ్మం జిల్లాలో పుట్టిన **షాజహానా** తొలి కథ *సిల్‌సిలా* 19 డిసెంబర్ 1999లో ఆంధ్రజ్యోతి ఆదివారంలో అచ్చయ్యింది. ఈ కథకి రంగవల్లి స్మారక పురస్కారం లభించింది. 16 కథలు రాశారు. ముస్లిం స్త్రీ కథల సంపుటి లద్ధాఫ్ని, రెండు కవితాసంపుటాలు ప్రచురించారు. సహచరుడు స్కైబాబాతో కలిసి చాంద్‌తార కవితాసంపుటిని కూడా ప్రచురించారు. కొంతకాలం డిగ్రీ కాలేజీ లెక్చరర్‌గా పనిచేశారు.

*చిరునామా: 402, ఝాన్సీ రెసిడెన్సీ, హుడా కాలనీ, తానాషానగర్*
*మణికొండ, హైదరాబాద్ - 500 089.*
*ఫోన్: 77990 59494   shajahana74@gmail.com*